


RNI: APTEL/2010/36742

# న్యూస్ వార్
వార్తా పత్రిక

TELANGANA RISING GLOBAL SUMMIT

నల్లగొండ | epaper.news war.com | శనివారం 21, మార్చి 2026 | సంపుటి :16 సంచిక : 4 | ఎడిటర్: నటవా కృష్ణారావు | పేజీలు : 4 , వెల.2.00




### తెలంగాణ శాసనసభ

## సోమవారానికి వాయిదా

తెలంగాణ శాసనసభ( వాయిదా పడింది. ఈరోజు సభలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక బడ్జెట్‌ను డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. రూ.3,24,234 కోట్ల భారీ బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు ఆర్థిక మంత్రి. ఈ బడ్జెట్‌లో వ్యవసాయం, విద్య, ప్రజా క్షేమం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేసింది సర్కార్. దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి స్పష్టం చేశారు. 'మేం పాలకులం కాదు.. ప్రజలకు సేవకులం' అని భట్టి విక్రమార్క తెలిపారు. బడ్జెట్ ప్రసంగం పూర్తి అయిన అనంతరం స్పీకర్ సభను సోమవారానికి వాయిదా వేశారు.

వార్త 2లో

# రూ. 3.24 లక్షల కోట్లతో

# సంక్షేమం, అభివృద్ధి

- రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించడమే లక్ష్యం
- ప్రజల సేవకుల లాగా పని చేస్తున్నాం
- గతంలో జరిగిన ఆర్థిక తప్పిదాలను సరిదిద్దుతూ
- అట్టడుగు వర్గాల సంక్షేమానికి ఈ బడ్జెట్
- ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క

వివరాలు 2లో..



తెలంగాణ రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని ఆవిష్కరిస్తూ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 3,24, 234 కోట్ల భారీ బడ్జెట్‌ను అసెం బ్లీలో ప్రవేశపెట్టారు. గత ప్రభుత్వాల ఆర్థిక విధ్వంసాన్ని సరిదిద్దుతూ, ఆర్థిక క్రమశిక్షణతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.





## కల్తీ చేస్తే కఠిన చర్యలు.. డీసీపీ గైక్వాడ్ వైభవ్ హెచ్చరిక

నగరంలో ఆహార కల్తీపై కట్టుదిట్టమైన చర్యలకు పోలీసులు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వైలెన్స్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్.. మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు.

వార్త 2లో

## విద్యార్థులకు గుడ్ న్యూస్ చెప్పిన తెలంగాణ సర్కార్

హైదరాబాద్,
విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రంలోని ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థుల వరకు అందరికి బ్రేక్ పాస్ట్ పథకాన్ని అందిస్తామని ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. అలాగే ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని తీసుకుని వస్తున్నామన్నారు. ఈ పథకాలను 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్నట్లు వివరించారు. శుక్రవారం తెలంగాణ అసెంబ్లీలో ఈ ఏడాది వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన ఈ ప్రకటన చేశారు. దివ్యాంగ, శారీరక వైకల్య విద్యార్థులకు రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్‌డ్ వాహనాల పంపిణీ చేస్తామని తెలిపారు. సంక్షేమ స్కూళ్లలో వసతుల మెరుగుకు చర్యలు



చేపడతామన్నారు. అందుకోసం రూ.100 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని 57 పాలిటెక్నిక్ కాలేజీలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్‌గా అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పాలిటెక్నిక్ కాలేజీల్లో 15 కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించారు. అలాగే స్కిల్ యూనివర్సిటీని విద్యా శాఖ పరిధిలోకి తీసుకు వస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు.

## ఇదో బోగస్ బడ్జెట్.

- ఆరు గ్యారెంటీలకు ఘోరీ కట్టారు
- ఈ బడ్జెట్‌లో సకల జనులకు దక్కింది గుండుసున్నా
- ఈ ప్రభుత్వంలో స్కాంలు తప్ప స్కీములు ఏమీ లేవు
- టెండర్ల మీద ఉన్న ప్రేమ పేదల మీద లేదు
- బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు



వార్త 2లో




2

## బీసీల ఆగ్రహం చూస్తారు.. ప్రభుత్వంపై గంగుల కమలాకర్ ఫైర్

## కేంద్రమంత్రికి కర్నాటక సీఎం లేఖ

హైదరాబాద్:

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా భారత్‌లో తీవ్రంగా గ్యాస్ సంక్షోభం నెలకొంది. గ్యాస్ కొరత వల్ల బెంగళూరులో వ్యాపారాలు మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో వాణిజ్య ఎల్‌పిజి గ్యాస్ కొరతని తీర్చాలని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శుక్రవారం కేంద్ర పెట్రోలియం శాఖా మంత్రికి లేఖ రాశారు. బెంగళూరులో నెలకొన్న గ్యాస్ కొరత ప్రజల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని, గ్యాస్ కొరతను తీర్చడానికి హర్దీప్ సింగ్ పూరి తక్షణమే జోక్యం చేసుకోవాలని సిద్ధరామయ్య తన లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది.



2

## ఆ 11 దేశాల గగన తలంలోకి వెళ్లొద్దు..డీజీసీఏ

## బిజెపి నేతలు బిసిల గురించి మాట్లాడితే హాస్యాస్పదంగా ఉంది : మహేష్ గౌడ్

హైదరాబాద్:

బిసిల గురించి బిజెపి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడారని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. బిజెపి, బిఆర్ఎస్ నేతలు ఒక్కటయ్యారనడానికి ఇంతకంటే నిదర్శనం లేదు అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బిజెపి నేతలు బిసిల గురించి మాట్లాడితే హాస్యాస్పదంగా ఉందని, బిజెపి రాష్ట్రాధ్యక్ష పదవి, బిజెపి ఎల్పి పదవుల్లో అగ్రవర్ణ నేతలే ఉన్నారని మహేష్ గౌడ్ తెలియజేశారు. బిసిల రిజర్వేషన్ల కోసం తాము బిల్లు తీసుకొస్తే.. దానిని బిజెపి తొక్కిపెట్టిందని, రాష్ట్రంలో డ్రగ్స్ పట్టుబడితే బిజెపి నేతలు మాట్లాడలేదని విమర్శించారు. బిజెపి, బిఆర్ఎస్ నేతలు మిలాఖత్ అయ్యారని మహేష్ కుమార్ గౌడ్ ఎద్దేవా చేశారు.





2

## కువైట్‌లోని కీలక రిఫైనరీపై ఇరాన్ డ్రోన్ దాడి

# రూ. 3.24 లక్షల కోట్లతో సంక్షేమం, అభివృద్ధి

### రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించడమే లక్ష్యం

### ప్రజల సేవకుల లాగా పని చేస్తున్నాం

### గతంలో జరిగిన ఆర్థిక తప్పిదాలను సరిదిద్దుతూ

### అట్టడుగు వర్గాల సంక్షేమానికి ఈ బడ్జెట్

### ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి



తెలంగాణ రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని ఆవిష్కరిస్తూ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క 2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 3,24,234 కోట్ల భారీ బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. గత ప్రభుత్వాల ఆర్థిక విధ్వంసాన్ని సరిదిద్దుతూ, ఆర్థిక క్రమశిక్షణతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

**బడ్జెట్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు:**

తాము గత పాలకుల వలె కాకుండా, ప్రజల సేవకుల లాగా పని చేస్తున్నామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా, సమాజంలోని అట్టడుగు వర్గాల సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేశామన్నారు. గతంలో జరిగిన ఆర్థిక తప్పిదాలను సరిదిద్దుతూ, రాష్ట్రాన్ని అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకు కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్నామని సభకు వివరించారు.దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ 1 స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి స్పష్టం చేశారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు, రాజకీయ అడ్డంకులు ఎదురైనా వెనకడుగు వేయకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ఈ బడ్జెట్ అటు సంక్షేమానికి, ఇటు అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిస్తూ రూపొందించామని అన్నారు. ముఖ్యంగా వ్యవసాయం, విద్య, వైద్య రంగాలకు గతంలో కంటే మెరుగైన కేటాయింపులు చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

## తెలంగాణ శాసనసభ సోమవారానికి వాయిదా

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

తెలంగాణ శాసనసభ( వాయిదా పడింది. ఈరోజు సభలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక బడ్జెట్‌ను డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. రూ. 3,24,234 కోట్ల భారీ బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు ఆర్థిక మంత్రి. ఈ బడ్జెట్‌లో వ్యవసాయం, విద్య, ప్రజా క్షేమం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేసింది సర్కార్. దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి స్పష్టం చేశారు. 'మేం పాలకులం కాదు.. ప్రజలకు సేవకులం' అని భట్టి విక్రమార్క తెలిపారు. బడ్జెట్ ప్రసంగం పూర్తి అయిన అనంతరం స్పీకర్ సభను సోమవారానికి వాయిదా వేశారు.

### బీఆర్ఎస్ వాకౌట్

కాగా... ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం కొనసాగతుండగానే సభ నుంచి బీఆర్ఎస్ వాకౌట్ చేసింది. అన్ని వర్గాలను మోసం చేశారంటూ.. చెవిలో పూలు పెట్టుకుని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. బడ్జెట్ ప్రతులను చించివేశారు. బడ్జెట్ మొత్తం మోసం.. మోసమంటూ బీఆర్ఎస్ సభలో నిరసనలు తెలిపింది. ఆరు గ్యారంటీలకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవంటూ బీఆర్ఎస్ నేతలు సభ నుంచి వాకౌట్ చేశారు.

### బడ్జెట్ ప్రతులను చించడం బాధాకరం: దానం నాగేందర్

సభ నుంచి బీఆర్ఎస్ నేతల వాకౌట్‌పై ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు. మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్ ప్రసంగం ముగిసే వరకు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క నీళ్లు కూడా తాగలేదన్నారు. కానీ బీఆర్ఎస్ నేతలు మాత్రం బడ్జెట్‌ను విమర్శిస్తూ చెవిలో పువ్వులు పెట్టుకొని వెళ్లిపోయారని మండిపడ్డారు. మాజీ మంత్రి హరీశ్ రావు బడ్జెట్ ప్రతులను చించివేయడం బాధాకరమన్నారు. ఈ బడ్జెట్ పేదలు, బీసీ, ఎస్సీ, విద్యార్థులకు ఉపయోగకరమైనదన్నారు. పేదలు, విద్యార్థుల గురించి మాట్లాడే సమయంలోనే బీఆర్ఎస్ వాళు వెళ్లిపోయారని ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు.

## కల్తీ చేస్తే కఠిన చర్యలు.. డీసీపీ గైక్వాడ్ వైభవ్ హెచ్చరిక

హైదరాబాద్:న్యూస్‌వార్ ప్రతినిధి

నగరంలో ఆహార కల్తీపై కట్టుదిట్టమైన చర్యలకు పోలీసులు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వైలెన్స్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్.. మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు.ఈ ప్రత్యేక బృందంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ సిబ్బంది కలిసి సుమారు 32 మంది సభ్యులు ఉంటారని గైక్వాడ్ వైభవ్ తెలిపారు. వీరు జీహెచ్‌ఎంసీ ఫుడ్ ఇన్స్పెక్టర్లతో కలిసి నగరవ్యాప్తంగా జాయింట్ రైడ్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఆహార పదార్థాల్లో కల్తీ ఎక్కువగా జరుగుతోందని.. ముఖ్యంగా పాలు, నాన్–వెజ్ కల్తీ చేస్తున్నారని ఆయన వెల్లడించారు. ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్న ఈ సమస్యను అరికట్టేందుకు కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.కల్తీ ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, పదే పదే ఇలాంటి కార్యకలాపాల్లో పట్టుబడితే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. అంతేకాకుండా, కల్తీ ఆహారం విక్రయించే దుకాణాలను సీజ్ చేసే చర్యలూ చేపడతామని తెలిపారు. కల్తీ ఆహార పదార్థాల గురించి సమాచారం ఉంటే వెంటనే 8712661212 నంబర్‌కు వివరాలు అందించవచ్చని నగర ప్రజలకు సూచించారు.

## బీసీల ఆగ్రహం చూస్తారు.. ప్రభుత్వంపై గంగుల కమలాకర్ ఫైర్

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

తెలంగాణ శాసనసభలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్(మీూా +ఖఅస్త్రబశ్రీఖ ఖఝశ్రీఖఝతీ) తీవ్ర విమర్శలు గుప్పించారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీసీలకు కేటాయించాల్సిన రూ. 20 వేల కోట్ల బడ్జెట్ ఎటు పోయిందని ప్రశ్నించారు. ప్రభుత్వం బీసీల గొంతు కోసిందని.. వారిని మోసం చేసిందని ఆరోపించారు. తులం బంగారం ఇస్తామని ఇవ్వకుండా చెవిలో పూలు పెట్టారని విమర్శించారు. ప్రభుత్వ డొల్లతనం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు.గతంలో కేసీఆర్ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇచ్చిందని మంత్రి ప్రకటించారని.. ఇప్పుడేమో కేసీఆర్ కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని అబద్ధాలు చెప్పడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల బడ్జెట్‌లో కోతల విధించారని.. ఇంతలా కోతల విధించిన బడ్జెట్‌ను ఇప్పుడే చూస్తున్నానని విమర్శించారు. బీసీల ఆత్మగౌరవ భూములను లాగే ప్రయత్నాలు చేస్తున్నారని.. బీసీల చెవిలో పువ్వులు పెట్టి మోసం చేశారని ఆరోపించారు. త్వరలోనే బీసీల ఆగ్రహం చూస్తారని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హెచ్చరించారు.

## ఆ 11 దేశాల గగనతలంలోకి వెళ్లొద్దు: డీజీసీఏ

హైదరాబాద్: మధ్యప్రాచ్యంలో యుద్ధం తీవ్రమవుతున్న నేపథ్యంలో, భద్రతా కారణాల దృష్ట్యా ఇరాన్‌తో సహా 11 దేశాల గగనతలంలోకి వెళ్లొద్దని భారత విమానయాన సంస్థలకు విమానయాన నియంత్రణ సంస్థ డీజీసీఏ కఠినమైన సూచనలు జారీ చేసింది. ఇరాన్ సైనిక, ఇంధన కేంద్రాలపై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ఆ ప్రాంతంలోని గగనతలం తీవ్ర ప్రమాదకర స్థితిలో ఉందని వచ్చిన నివేదికల తర్వాత ఈ చర్య తీసుకున్నారు. ఇరాన్, ఇజ్రాయెల్, లెబనాన్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఒమన్, ఇరాక్, జోర్డాన్, కువైట్, ఖతార్ దేశాల గగనతలాలను 'అధిక ప్రమాదం'గా ఉన్న జాబితాలో చేర్చారు. ఈ దేశాల మీదుగా అన్ని ఎత్తులలోనూ విమాన ప్రయాణాలను నివారించాలని ఆ ఆదేశంలో పేర్కొన్నారు.ఒకవేళ ఒమన్, సౌదీ అరేబియా మీదుగా విమానాలను నడపాల్సి వస్తే, 32,000 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో మాత్రమే ప్రయాణించాలని డీజీసీఏ స్పష్టం చేసింది. అత్యాధునిక క్షిపణులు, డ్రోన్‌ల ఉనికి పౌర విమానాలకు ముప్పు కలిగిస్తుందని డీజీసీఏ హెచ్చరించింది. విమానాలను తప్పుగా గుర్తించే లేదా అవి సైనిక కార్యకలాపాలలో పాలుపంచుకునే ప్రమాదం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఎయిర్ ఇండియా, ఇండిగో, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ వంటి విమానయాన సంస్థలు పశ్చిమ ఆసియా దేశాలకు తమ సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశాయి. యూరప్, అమెరికాకు వెళ్లే విమానాలను ఎక్కువ దూరాలున్న సురక్షిత మార్గాలకు మళ్లిస్తారు. దీనివల్ల ప్రయాణ సమయాలు పెరుగుతాయి. ప్రస్తుత మార్గదర్శకాలు మార్చి 28 వరకు అమలులో ఉంటాయని, పరిస్థితిని అంచనా వేసిన తర్వాత వాటిని సవరిస్తామని డీజీసీఏ తెలిపింది.సిరియా, యెమెన్ గగనతలాన్ని నివారించాలన్న మునుపటి ఆదేశం ఇప్పటికీ అమలులో ఉంది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశం పరిస్థితిని సమీక్షించింది. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, టిక్కెట్ల ధరలను అధికంగా పెంచకుండా చూసుకోవాలని విమానయాన సంస్థలకు సూచించారు. మధ్యప్రాచ్యంలో ఉన్న భారతీయుల భద్రతను నిర్ధారించడానికి విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో కలిసి కేంద్ర ప్రభుత్వం కూడా కృషి చేస్తోందని తెలిపింది.

## ఇదో బోగస్ బడ్జెట్.

### ఆరు గ్యారెంటీలకు ఘోరీ కట్టారు

### ఈ బడ్జెట్‌లో సకల జనులకు దక్కింది గుండుసున్నా

### ఈ ప్రభుత్వంలో స్కాంలు తప్ప స్కీములు ఏమీ లేవు

### టెండర్ల మీద ఉన్న ప్రేమ పేదల మీద లేదు

### బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

బడ్జెట్‌పై బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తీవ్రంగా నిరాశపరిచిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆరు గ్యారెంటీలకు ఘోరీ కట్టారని విమర్శించారు. అన్ని రంగాలకు మొండిచేయి చూపారని అన్నారు. ఈ బడ్జెట్‌లో సకల జనులకు దక్కింది గుండుసున్నా అని ఎద్దేవా చేశారు.అంకెల గారడీ, మాటల గారడీ తప్ప బడ్జెట్‌లో ఏమీ లేదని అన్నారు. బడ్జెట్ ప్రసంగంలో తెలంగాణ పరిస్థితి బాగా ఉందని చెబుతున్నారని, మరోవైపు మూడేళ్లు కాకుండానే మూడున్నర లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శించారు. ఈ ప్రభుత్వంలో స్కాంలు తప్ప స్కీములు ఏమీ లేవని ఎద్దేవా చేశారు. మేడారం టెండర్లలో అవినీతి జరిగిందని స్వయంగా మంత్రి కుమార్తె ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. బడ్జెట్‌ను చూస్తుంటే ఇదో బోగస్ బడ్జెట్ అని అర్థమవుతోందని హరీశ్ రావు విమర్శించారు. గతంలో నిధులు కూడా ఖర్చు చేయని పథకాలకు మళ్లీ నిధులు కేటాయించడమేమిటని ప్రశ్నించారు. పెట్టుబడులు, ఉద్యోగ కల్పనపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసినా పట్టించుకోలేదని అన్నారు. ఈ ప్రభుత్వానికి టెండర్ల మీద ఉన్న ప్రేమ పేదల మీద లేదని అన్నారు. ఇది కాంగ్రెస్ పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమని అన్నారు.వెనుక పిరాయింపు ఎమ్మెల్యేలను కూర్చోబెట్టుకుని భట్టి విక్రమార్క రాజ్యాంగ విలువల గురించి మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. రేవంత్ రెడ్డి తుగ్లక్ పాలన వల్ల రాష్ట్ర అభివృద్ధి పడిపోయిందని అన్నారు. క్యూర్, రేర్, ప్యూర్ పేరుతో హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడుతోందని మండిపడ్డారు. కూల్చడాల మీద ఉన్న ప్రేమ నిర్మించడంపై లేదని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఇండస్ట్రియల్ డీజిల్ ధరల మోత... లీటర్ పై ఏకంగా రూ.22 పెంపు

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు దేశీయ ఇంధన ధరలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇరాన్, ఇజ్రాయెల్–అమెరికా మధ్య యుద్ధ వాతావరణం కారణంగా క్రూడ్ ఆయిల్ ధరలు భగ్గుమనడంతో, చమురు మార్కెటింగ్ కంపెనీలు ధరలను భారీగా పెంచాయి. ముఖ్యంగా పరిశ్రమల్లో వాడే బల్క్ డీజిల్ (ఇండస్ట్రియల్ డీజిల్) ధరను లీటరుకు ఏకంగా రూ. 22.03 పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి.శుక్రవారం నుంచి ఈ కొత్త ధరలు అమలులోకి వచ్చాయి. ఈ పెంపుతో లీటరు ఇండస్ట్రియల్ డీజిల్ ధర రూ. 87.57 నుంచి రూ. 109.59కి చేరింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) కూడా తన ధరలను సవరించింది. సాధారణ వాహనాల్లో కాకుండా ఫ్యాక్టరీలు, షాపింగ్ మాల్స్, నిర్మాణ రంగంలోని భారీ యంత్రాలు, జనరేటర్లలో ఈ ఇండస్ట్రియల్ డీజిల్‌ను వినియోగిస్తారు. దీని ధర పెరగడం వల్ల పరిశ్రమల ఉత్పత్తి వ్యయం గణనీయంగా పెరుగుతుంది. ఈ భారం పరోక్షంగా రవాణా, ఇతర వ్యాపార కార్యకలాపాలపై పడి చివరికి నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు దారితీస్తుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, స్పీడ్, పవర్ వంటి ప్రీమియం పెట్రోల్ రకాల ధరలను కూడా లీటరుకు రూ. 2.09 మేర పెంచారు.ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ముడి చమురు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని అంచనా వేస్తున్నారు.



## కువైట్‌లోని కీలక రిఫైనరీపై ఇరాన్ డ్రోన్ దాడి

గల్ఫ్ దేశాల్లోని కీలక చమురు సదుపాయాలపై ఇరాన్ దాడులు ఉద్ధృతం చేసింది. కువైట్‌లో కీలకమైన మినా అల్ అహ్మదీ చమురు శుద్ధి కర్మాగారంపై డ్రోన్ దాడికి పాల్పడింది. ఇటీవల ఖతార్‌లోని రస్ లఫాన్ గ్యాస్ క్షేత్రం, సౌదీ అరేబియాలోని అరామ్‌కో చమురుక్షేత్రంపై ఇరాన్ దాడులు చేసింది. రంజాన్ పండుగ తరుణంలో ఈ దాడి జరిగింది.పశ్చిమాసియాలోని అతిపెద్ద ఆయిల్ రిఫైనరీలలో ఈ మినా అల్ అహ్మదీ కూడా ఒకటి. డ్రోన్ దాడి నేపథ్యంలో రిఫైనరీలో భారీగా మంటలు చెలరేగాయి. అధికారులు వాటిని అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ దాడి నేపథ్యంలో ఎవరైనా గాయపడ్డారా, ఆస్తి నష్టం ఎంత అనే వివరాలు తెలియాల్సి ఉంది. ఈ రిఫైనరీ నిత్యం 7,30,000 బ్యారెళ్ల చమురును శుద్ధి చేస్తుంది.మరోవైపు, దుబాయ్ నగరం పైకి ఇరాన్ భారీ స్థాయిలో డ్రోన్లు ప్రయోగించింది. దుబాయ్ వైమానిక రక్షణ వ్యవస్థలు వాటిని అడ్డుకున్నాయి. ఈ క్రమంలో భారీ పేలుళ్లు వినిపించాయి. తమపై దూసుకొచ్చిన ఒక క్షిపణిని అడ్డుకున్నట్లు బహ్రెయిన్ తెలిపింది. క్షిపణి శకలాలు పడటంతో ఓ గోడౌన్‌లో మంటలు చెలరేగాయి.

## ఇరాన్-ఇజ్రాయెల్ టెన్షన్: చివరి గంటలో లాభాలను కోల్పోయిన మార్కెట్లు



భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం నాడు లాభాలతో ముగిసినప్పటికీ, చివరి గంటలో అమ్మకాల ఒత్తిడితో ఇంట్రాడే గరిష్ఠాల నుంచి వెనక్కి తగ్గాయి. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరగడంతో అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగాయి. ఈ పరిణామం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 325.72 పాయింట్లు లాభపడి 74,532.96 వద్ద, నిఫ్టీ 112.35 పాయింట్లు పెరిగి 23,114.50 వద్ద స్థిరపడ్డాయి.ట్రేడింగ్ చివరి గంటలో మధ్యప్రాచ్యంలో దాడులు జరిగినట్లు వార్తలు రావడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరిగాయి. ఇది గ్లోబల్ ఎనర్జీ సరఫరాపై ఆందోళనలను రేకెత్తించింది. భారత్ వంటి చమురు దిగుమతులపై ఆధారపడిన దేశాలకు ఇది ప్రతికూల అంశం కావడంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. దీంతో సూచీలు రోజు గరిష్ఠాల నుంచి కిందకు జారాయి.ఈ ప్రభావం బ్రాడర్ మార్కెట్లపైనా కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.67 శాతం లాభంతో ముగియగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ కేవలం 0.09 శాతం లాభంతో సరిపెట్టుకుంది. రంగాలవారీగా చూస్తే, నిఫ్టీ రియల్టీ సూచీ సుమారు 1 శాతం క్షీణించింది. దీనికి భిన్నంగా, ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్ వంటి రంగాలు మంచి లాభాలను నమోదు చేశాయి.మరోవైపు, డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ చరిత్రాత్మక కనిష్ఠానికి పడిపోయింది. శుక్రవారం ట్రేడింగ్‌లో 1.17 శాతం నష్టపోయి 93.71 వద్ద ముగిసింది. టెక్నికల్‌గా నిఫ్టీకి 23,350 పాయింట్ల వద్ద బలమైన నిరోధం ఉందని, 23,000 స్థాయిని కోల్పోతే మరింత దిద్దుబాటుకు అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. రానున్న రోజుల్లో మార్కెట్లు భౌగోళిక రాజకీయ పరిణామాలు, చమురు ధరల కదలికలను నిశితంగా గమనిస్తాయని భావిస్తున్నారు.

న్యూస్ వార్ వార్తా పత్రిక

సంపాదకీయం...

# అనర్థదాయకం!

సామాన్యులకు ఎంతోకొంత ఊరటగానున్న ఆరోగ్యశ్రీ పథక సేవలను, రాష్ట్రంలో 10 కొత్త వైద్య కళాశాలలను పిపిపి పేరిట ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడం అనర్థదాయకం. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకాలను కలిపి హైబ్రిడ్ మోడ్‌లో యూనివర్సల్ హెల్త్ పాలసీని రూపొందించాలని ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో అది జనాన్ని వైద్య ఆరోగ్య సేవలకు దూరం చేయడమే అవుతుంది. దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న కుటుంబాలకు బీమా కంపెనీ ద్వారా కుటుంబానికి ఏడాదికి రూ.2.5 లక్షల వరకు, ఆపైన ఖర్చయితే ట్రస్టు ద్వారా రూ.25 లక్షల వరకు కవరేజ్ ఉంటుందన్నది ప్రచారానికి బాగానేవుంటుంది. దారిద్ర్య రేఖకు ఎగువున ఉన్న కుటుంబాలకు ఏడాదికి రూ.2 నుంచి 5లక్షల వరకు బీమా కవరేజ్‌ను అందిస్తామనీ ఇదంతా కలిపి యూనివర్సల్ హెల్త్ కవరేజ అని సర్కారు నమ్మబలుకుతోంది. రాష్ట్ర విభజన అనంతరం 2015-16లో ఎపిఎల్ కుటుంబాలకూ హెల్త్ కవరేజి అని ప్రచారం చేసి ప్రీమియంలు కట్టించుకున్నారేకానీ ప్రజలకు లబ్ధి చేకూరిన దాఖలాల్లేవు. తాజా పథకం ద్వారా 3257 రకాల వైద్య సేవలు అందజేస్తారని, ప్రతి రోగికి ఒక క్యూఆర్ కోడ్ ఇచ్చి అమలు తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామన్న అమాత్యుల మాట నీటిమీద రాతగానే మిగిలిపోవచ్చు. రాష్ట్రంలో 10 కొత్త వైద్య కళాశాలలను పిపిపి పేరిట ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని నిర్ణయించగా తొలి దశలో ఆదోని, మార్కాపురం, మదనపల్లి, పులివెందుల కళాశాలలో అమలు చేయనున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే వైద్య కళాశాలలు నైపుణ్యానికి, నాణ్యతకు, సామాజిక న్యాయానికి




పెద్దపీట వేస్తాయి. ప్రైవేటు యాజమాన్యాలు మెరిట్ పక్కనబెట్టి సంపన్నులకే సీట్లు ఇస్తాయి కనుక పేద, మధ్యతరగతి విద్యార్థులు వైద్యవిద్యకు దూరం అవుతారు. వ్యాపార దృక్పథం ముందుకు వచ్చి పేదలకు వైద్యం అందుబాటులో లేకుండా పోతుంది. వైద్య ఆరోగ్య రంగం ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండడం సరైనదని అనేక దేశాల్లో నిరూపితమైంది. యుకె, నెదర్‌ల్యాండ్స్ ఇంకొన్ని స్కాండినేవియన్ దేశాల్లో ఆదర్శవంతమైన ఆరోగ్య వ్యవస్థ నడుస్తోంది.

ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే! ప్రభుత్వ వైద్యం బలపడి ఉచితంగా అందిస్తేనే అది సాధ్యమవుతుంది. ప్రైవేట్ ఇన్సూరెన్సు కంపెనీలు వ్యాపారం చేస్తాయే కానీ సేవ చేయవు. అనర్థదాయకమైన ఈ నిర్ణయాలను ఉపసంహరించుకొని ప్రభుత్వ రంగంలోనే వైద్య విద్య, ఆరోగ్య సేవలను కొనసాగించాలి. సెల్ఫ్‌ఫైనాన్స్ పేరుతో మెడికల్ కాలేజీల్లో ఉన్న రిజర్వేషన్ సీట్లలో సగం సీట్లను లక్షలకు అమ్ముకునే జిఓ 107, 108ని రద్దు చేయాలి. ఇదిలావుండగా రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో రాజ్యాంగాన్ని, సుప్రీం కోర్టు తీర్పులను సైతం ఉల్లంఘించి ప్రైవేటు పంప్డ్ స్టోరేజి హైడ్రో ప్రాజెక్టుకు అనుమతులిచ్చిన ప్రభుత్వం గురువారంనాటి క్యాబినెట్ సమావేశంలో వాటి సామర్థ్యం పెంచడం, నీటి కేటాయింపులను కూడా చేయడం దారుణం. జలవనరుల శాఖ మార్గదర్శకాలు, లభ్యతకు అనుగుణంగా కేటాయింపులకు ఆమోదం తెలిపామని చెబుతున్నా ఆచరణలో నదుల్లోని నీటిని విద్యుత్ ప్రాజెక్టులే పొందుతాయి కనుక దిగువనున్న ఆయకట్టు రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది. కడప జిల్లా కొండాపురం మండలంలో చింత గ్రీన్ ఎనర్జీ కొప్పోలు పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టుకు ఏకంగా గండికోట రిజర్వాయర్‌ను లోయర్ రిజర్వాయర్‌గా ఉపయోగించడానికి ఆమోదం తెలపడం ప్రమాదకరం. గత వైసిపి ప్రభుత్వ పెద్దలు లంచాలు బొక్కి ఒప్పందాలు చేశారని అమెరికాలో కేసులు వచ్చిన సెకి చేసిన సత్యసాయి జిల్లా ముత్తుకుంట గ్రామంలో రూ.800 కోట్ల ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలపడం ద్వారా ఇప్పుడు కూడా గత పాలకుల విధానాలే కొనసాగుతున్నాయని చెప్పడమే అవుతుంది. సామాన్యులకు అందే వైద్య ఆరోగ్య సేవలను వారికి దూరం చేసి అదాని అంబానీ వంటి కార్పొరేట్లకు కాసులు కురిపించే విధానాలను ప్రభుత్వం విడనాడాలి. అటువంటి నిర్ణయాలను ఉపసంహరించుకోవాలి. లేకపోతే రాష్ట్ర ప్రజలకు హాని జరగడమేగాక ప్రభుత్వానికి కూడా రాజకీయంగా చేటు కలగవచ్చు

# హర్మూజ్ విముక్తికి అమెరికా యత్నాలు

## ఇరాన్ బోట్లను ఎదుర్కొనేందుకు సన్నద్ధం

## యూరోపియన్ దేశాలు సైతం మద్దతు




**వాషింగ్టన్/లండన్,**

హర్మూజ్‌పై పట్టుకు అమెరికా యత్నాలు ప్రారంభించింది. ఇరాన్ క్షిపణులను, డ్రోన్లు, బోట్లను ఎదుర్కొనేందుకు సన్నద్ధం అవుతోంది. హర్మూజ్ విముక్తికి యూరోపియన్ దేశాలు సైతం మద్దతుగా ముందుకు సాగనున్నాయి. ప్రపంచ చమురు జీవనాడి హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు కీలక పోరును అమెరికా మొదలుపెట్టింది. ఇందుకోసం తీర ప్రాంతంలో ఇరాన్ మోహరించిన క్షిపణి లాంచర్లు, డ్రోన్లు, బోట్లు వంటి లక్ష్యాలను ఛేదించేందుకు తక్కువ ఎత్తులో ఎగిరే అపాచీ అటాక్ హెలికాప్టర్లు , తక్కువ ఎత్తులో ఎగిరే విమానాలను రంగంలోకి దింపినట్లు అమెరికా సైనికాధికారులను ఉటంకిస్తూ కథనంలో వెల్లడించింది. అమెరికా ఛైర్మన్ ఆఫ్ ది జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ జనరల్ డాన్ కెయిన్ ఈ విషయాన్ని వెల్లడించినట్లు తెలిపింది. ఈ జలసంధిలో ఇరాన్ సీమైన్స్, బోట్స్, మిసైల్స్ నుంచి ఎదురయ్యే ప్రమాదాల్ని అరికట్టేందుకు ఈ ఆపరేషన్ ప్రారంభించారు. ఈ ప్రాంతాన్ని దిగ్బంధిస్తూ ఇరాన్ పరిచిన ఉచ్చులను పూర్తిగా తొలగించడానికి వారానికి పైగా సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ జలసంధి మూసివేతతో చమురు ధరలు 119 డాలర్లను తాకిన విషయం తెలిసిందే. భారీ ఆయుధాలతో ఎ-10 యుద్ధ విమానాలకు తోడు అపాచీ అటాక్ హెలికాప్టర్లను కూడా పంపించింది. ఇవి హర్మూజ్ జలసంధిపై అతితక్కువ ఎత్తులో ఎగురుతూ శత్రులక్ష్యాలను మట్టుబెడుతున్నాయి. ఎ-10 యుద్ధ విమానాలు దక్షిణ తీర ప్రాంతాల్లోని ఇరాన్ ఫాస్ట్ అటాక్ క్రాఫ్ట్‌లను లక్ష్యంగా చేసుకొన్నట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో తమ మిత్ర దేశాలు కొన్ని అటాక్ డ్రోన్లను ఎదుర్కోవడానికి అపాచీ హెలికాప్టర్లను రంగంలోకి దించినట్లు జనరల్ డాన్ కెయిన్ వెల్లడించారు. అయితే.. ఆ దేశాల పేర్లు చెప్పేందుకు నిరాకరించారు. వాస్తవానికి కొన్నాళ్ల నుంచే ఎ-10, అపాచీ హెలికాప్టర్లు ఈ పనిచేస్తున్నట్లు చెప్పారు. వీటికి అండగా ఇప్పటికే ఆ ప్రాంతంలో ÷టైర్ జెట్లు కూడా పనిచేస్తున్నాయి. ఇప్పటివరకు 120 నౌకలను పేల్చేసినట్లు రక్షణ మంత్రి పీట్‌హెగ్సెత్ వెల్లడించిన విషయం తెలిసిందే. అమెరికా ఎ-10 విమానాలను పదాతి దళాలకు క్లోజ్‌ఎయిర్ సపోర్ట్ మిషన్ల కోసం నిర్మించారు. తాజాగా ఇప్పుడు వాటిని నౌకలను ధ్వంసం చేయడానికి వినియోగిస్తున్నారు. దీని ముక్కుపై 30 ఎంఎం గన్ ఉండగా.. రెక్కలపై బాంబులు అమర్చి ఉంటాయి. అమెరికా ఎ-10 విమానాలు జోర్డాన్ కేంద్రంగా ఉన్నాయి. వీటిని గతంలో ఐసిస్‌పై ఆపరేషన్లకు వాడారు. ఇప్పటికే దాదాపు 2,200 మంది అమెరికా మెరైన్ కమాండోలు ఇరాన్ యుద్ధంలో పాల్గొనేందుకు బయల్దేరారు. వీరు ఇరాన్ దక్షిణతీరంలోని ద్వీపాలను స్వాధీనం చేసుకొని హర్మూజ్ జలసంధిపై పట్టు సాధించాలన్నది వ్యూహంగా కనిపిస్తోంది. ఇదిలావుంటే హార్ముజ్ జలసంధి రక్షణ ప్రయత్నాల్లో చేరేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అలాగే ఇంధన మార్కెట్లను స్థిరీకరించడానికి చర్యలు తీసుకుంటామని ఐరోపా దేశాలైన బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, జపాన్ మరియు కెనడాలు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపాయి. గల్ఫ్‌లో నిరాయుధ వాణిజ్య నౌకలపై ఇరాన్ ఇటీవల జరిపిన దాడులను, చమురు మరియు గ్యాస్ సహా పౌర మౌలిక సదుపాయాలపై జరిపిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రకటన పేర్కొంది. హార్ముజ్ జలసంధిని మూసివేయడాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాము. తీవ్రమవుతున్న ఘర్షణ పట్ల మేము తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాము. ఇరాన్ తన బెదిరింపులను, డ్రోన్ మరియు క్షిపణి దాడులను, వాణిజ్య నౌకాయానానికి జలసంధిని అడ్డుకునే ఇతర ప్రయత్నాలను తక్షణమే నిలిపివేయాలని, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానం 2817కు కట్టుబడి ఉండాలని పిలుపునిస్తున్నామని పేర్కొంది. జలసంధి ద్వారా సురక్షిత ప్రయాణాన్ని నిర్ధారించడానికి తగిన ప్రయత్నాలకు సహకరించేందుకు మేము సిద్ధంగా ఉన్నాము. సన్నాహక ప్రణాళికలో నిమగ్నమైన దేశాల నిబద్ధతను మేము స్వాగతిస్తున్నామని ప్రకటన పేర్కొంది. వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను సమన్వయంతో విడుదల చేయడానికి అధికారం కల్పించిన అంతర్జాతీయ ఇంధన సంస్థ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాము. ఉత్పత్తిని పెంచడానికి కొన్ని ఉత్పాదక దేశాలతో కలిసి పనిచేయడంతో సహా, ఇంధన మార్కెట్లను స్థిరీకరించడానికి ఇతర చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

# ఎరువుల ఉత్పత్తికి ఇంధన పోటు

## ఎరువుల సరఫరాను నిలిపివేయనున్న చైనా

## భారత్ తదితర దేశాలకు రవాణ ఆపే చర్యలు

## పలుదేశాల వ్యవసాయరంగంపై తీవ్ర ప్రభావం



**న్యూఢిల్లీ,**

ముడి చమురు సరఫరాలో అవాంతరాలతో ఇక్కట్ల పాలవుతున్న ప్రపంచదేశాలకు కొత్త సమస్య వచ్చి పడేటట్టు ఉందన్న భయాలు నెలకొన్నాయి. ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇప్పటికే చమురు సరఫరా సమస్యలు ఎదుర్కొంటున్నాయి. మరోవైపు ప్రపంచంలోని అతిపెద్ద ఎరువుల ఎగుమతిదారుల్లో ఒకటిగా ఉన్న చైనా యుద్ధ ప్రభావం వల్ల.. జెట్ ఇంధనం, డీజిల్, ఎరువుల ఎగుమతులపై పలు నిబంధనలు విధించడానికి చర్యలు తీసుకుంటోంది. దీంతో ప్రపంచ మార్కెట్‌లో యూరియా కొరత ఏర్పడే అవకాశం ఉందని వ్యవసాయ ఆధారిత దేశాల్లో ఆందోళన నెలకొంది. ఎరువుల ఎగుమతుల్లో ప్రపంచంలో నెం.2గా ఉన్న చైనా వీటి ఎగుమతులపై ఆంక్షలకు సిద్ధమైంది. ఎగుమతుల్లో కోత పెట్టాలని చైనా ఆర్థిక ప్రణాళిక సంస్థ ఎన్‌డీఆర్‌సీ దేశీయ సంస్థలకు సూచించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో జెట్ ఫ్యుయెల్, డీజిల్, కిరోసిన్‌ల ఎగుమతులను తగ్గించాలని గత నెలలో ఎన్‌డీఆర్‌సీ సూచించింది. దేశీయ ఇంధన, ఆహార అవసరాల కోసం చైనా ఎగుమతులపై ఆంక్షలు విధిస్తోందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. చైనా ఎరువులు ఆస్ట్రేలియా, వియత్నాం వంటి దేశాలతో పాటు భారత్‌కూ ఎగుమతి అవుతుంటాయి. కొన్ని దేశాలకు ఎగుమతులను నిలిపివేయాలని తమకు ఆదేశాలు అందాయని షాండాంగ్ ప్రావిన్స్‌లోని ఒక ఫర్టిలైజర్ సంస్థ అధికారి పేర్కొన్నారు. అయితే, ఈ ఆంక్షల విషయమై చైనా ఇంకా అధికారికంగా స్పందించలేదు. ఎగుమతులకు బ్రేకులు తప్పవని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడు తున్నాయి. దేశీయ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు చైనా అన్ని చర్యలు తీసుకుంటుందని అంటున్నాయి. ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ డేటా ప్రకారం, ఎరువుల ఎగుమతుల్లో రష్యా నెం.1 కాగా రెండో స్థానంలో చైనా ఉంది. జెట్ ఫ్యుయెల్ ఎగుమతి చేసే దేశాల్లో చైనా ఆరవ స్థానంలో ఉంది. అంతర్జాతీయ వాణిజ్య కేంద్రం డేటా ప్రకారం.. జెట్ ఇంధనం, డీజిల్, కిరోసిన్‌ల విదేశీ రవాణాను నిలిపివేయాలని చైనా జాతీయ అభివృద్ధి, సంస్కరణల కమిషన్ అక్కడి పరిశ్రమ వర్గాలకు ఆదేశాలు జారీ చేసింది. మార్చి మధ్య నుంచే నైట్రోజన్, పొటాషియం ఎరువుల మిశ్రమాలపై నిబంధనలు విధించింది. ఇప్పటికే యూరియా ఎగుమతిని బ్యాన్ చేసిన బీజింగ్.. అమ్మోనియా సల్ఫేట్ ఎగుమతికి మాత్రం అనుమతినిచ్చింది. ఇంధన, ఆహార నిల్వలు పరిరక్షించుకోవడానికి, దేశీయ మార్కెట్‌ను కాపాడుకోవడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని చైనా ప్రభుత్వం అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. అయితే భారత్‌కు ఎరువుల ఎగుమతిని నిలిపివేయాలని చైనాలోని షాన్‌డాంగ్ ప్రావిన్స్‌లోని ఓ ఎరువుల తయారీ సంస్థకు ప్రభుత్వ ఆదేశాలు వచ్చినట్లు అక్కడి ఉద్యోగులు వెల్లడించారు. బీజింగ్ నుంచి ఆస్ట్రేలియా, వియత్నాం, భారత్ సహా పలు దేశాలు ప్రస్తుతం ఎరువులను దిగుమతి చేసుకుంటున్నాయి. చైనా నుంచి ఎగుమతులు నిలిచిపోవడం వల్ల ప్రపంచ మార్కెట్‌లో యూరియా ధరలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనివల్ల వ్యవసాయ ఆధారిత దేశాలపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. మరోవైపు యూరియా ఉత్పత్తికి అవసరమైన ద్రవరూప సహజ వాయువు ఎల్ఎన్‌జీ సరఫరా లేకపోవడంతో భారత్‌లోని పలు యూరియా కంపెనీలు ఎ÷-లాంట్లను మూసివేసే పరిస్థితులు నెలకొన్నట్లు ఇటీవల పలు సర్వేలు వెల్లడించాయి.

# అకాల వర్షంతో అన్నదాతల కుదేలు

## దెబ్బతిన్న పలు రకాల పంటలు

## భారీగా నష్టపోయామని ఆందోళన

## రైతులను ఆదుకుంటామన్న మంత్రి అచ్చెన్నాయుడు

**అమరావతి**

అకాల వర్షాలకు పంట నష్టపోయిన ప్రతి రైతుకూ సాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. అకాల వర్షాల నేపథ్యంలో ఉన్నతాధికారులతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాబోయే 3-4 రోజులు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వడగళ్లతో కూడిన అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతుల్ని అప్రమత్తం చేయాలని అచ్చెన్నాడు చెప్పారు. దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించాలని అన్నారు. అధికారులు నష్టం వివరాలను ఎప్పటికప్పుడు సేకరించాలని సూచించారు. ఇకపోతే వరుసగా రెండో రోజూ అకాల వర్షాలు కురవడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని అన్నదాతలు కన్నీరుమున్నీరు అవుతున్నారు. గురువారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులతో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, ఒకటి, రెండుచోట్ల భారీవర్షాలు కురిశాయి. గంటకు 40 నుంచి 50, అప్పుడప్పుడు 60 కి.మీ. వేగంతో గాలులు వీచాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి, జి.మాడుగులలో వడగళ్లు పడ్డాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో గురువారం కురిసిన మోస్తరు వర్షాలకు మొక్కజొన్న, మినుము, పెసర పంటలు మళ్లీ తడిచాయి. తడిచిన కారణంగా కాయలు రాలిపోతాయని, మినుము రంగుమారిపోతుందని, గింజలు రంగు మారిపోతాయని, రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని నందిగామ, పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం మండలాల్లో మొక్కజొన్న పంట నేలవాలింది. లంక భూముల్లో కోత అనంతరం ఆరబెటట్టిన మిర్చిపంట, ఉడకబెట్టి ఆరబోసిన పసుపు తడిచిపోయాయి. నెల్లూరు జిల్లాలో బుధ, గురువారాల్లో రాత్రిపూట కురిసిన వర్షాలకు కోతకు వచ్చిన వరి పైరు దెబ్బతినగా, మామిడి పూత, పిందెలు నేలరాలాయి. రాపూరు మండలం గోనుపల్లిలో వడగండ్ల వానకు దాదాపు 100 ఎకరాలకుపైగా వరి నేలవాలింది. రాంకూరు, గరిమెనపెంట గ్రామాల్లోని 100 ఎకరాల్లో మామిడి తోటల్లోని పూత, పిందె నేలరాలింది. నిమ్మ తోటల్లో పండ్లు రాలిపోయాయి. అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లి, లింగంగుంట, మంగుపలి,?ల కామిరెడ్డిపాడు, అనంతసాగరం గ్రామాల్లో వరి దెబ్బతినగా, గుడిగుంట, గౌరవరం, గుడిగుంట గ్రామాల్లో మిరప, బొప్పాయి, పత్తి మెట్ట పైర్లు దెబ్బతిన్నాయి. కొండాపురం, జలదంకి మండలాల్లో వరి కోతలు పూర్తి చేసిన రైతులు గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి ధాన్యం రాశులను కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనంతపురం జిల్లాలో రైతులకు రూ.1.29 కోట్ల పంటనష్టం వాటిల్లినట్టు అంచనావేశారు.

న్యూస్ వార్
వార్తా పత్రిక

# చండూరు ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీరియస్

## భవిష్యత్తుకు భరోసాగా రాష్ట్ర బడ్జెట్

### కాంగ్రెస్ నేత ఐలయ్య యాదవ్.



రాష్ట్ర డిప్యూటీ సీఎం ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన 2026 -27 రాష్ట్ర బడ్జెట్ భావితరాల భవిష్యత్తు కు భరోసా గా ఉంది. మూడు లక్షల 24 వేల 234 కోట్ల ( 3,24,234 )తో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ ప్రజల ఆశలు ఆకాంక్షలు అనుగుణంగా ఆర్భాటాలకు పోకుండా వాస్తవాలకు దగ్గరగా ఉంది. ఈ బడ్జెట్లో విద్యకు 26,674 కోట్లతో బడ్జెట్లో పెద్దపీట వేశారు ..వైద్యానికి, పంచాయతీ.. గ్రామీణ అభివృద్ధి కొరకు రు.33, 688 కోట్ల తో అధిక ప్రాధాన్యత ప్రభుత్వం ఇచ్చింది. వ్యవసాయం, ఇరిగేషన్ కలిపి 45 వేల కోట్లకు పైగా బడ్జెట్ లో పెట్టి రైతులకు కూడా ప్రాధాన్యత ఇచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతులు బడుగు బలహీన వర్గాలు ఎస్సీ ఎస్టీలు మైనార్టీలు విద్యార్థి యువత అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం .. అభివృద్ధి లక్ష్యంతో బడ్జెట్ ప్రవేశపెట్టినట్టు కనపడుతుంది. భావి తరాల భవిష్యత్తుకు ఈ బడ్జెట్ లో ప్రభుత్వం బాటలు వేసింది. ఈ బడ్జెట్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సాగునీటి పెండింగ్ ప్రాజెక్టుల తో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు అధికంగా నిధులు కేటాయింప చేస్తారని ఆశ ఉంది.. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జక్కలి ఐలయ్య యాదవ్ అన్నారు.

## కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలుగుల గ్రామపంచాయతిలో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు సర్పంచ్ గోరె విజయలక్ష్మి శంకర్ తో కలిసి శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో పదిహేను రోజులపాటు పారిశ్రామిక మరియు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమాన్ని భారతీయ మహిళా పారిశ్రామిక వేత్తల సంఘం ఆధ్వర్యంలో "చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి మరియు వేగవంతం"అనే అంశంతో నిర్వహిస్తున్నారు.ఈ శిక్షణలో మహిళలు చురుకుగా పాల్గొని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని నిర్వాహకులు సూచించారు.ఈ కార్యక్రమం ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకొని,చిన్నతరహా పరిశ్రమల స్థాపనలో ముందుకు రావడానికి దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపిడివో రవీంద్రనాథ్,ఉప సర్పంచ్ ఒద్ది చంద్రయ్య,ఏపీఎం రాజన్న,వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు

### -శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జిల్లా ప్రజలకు రంజాన్ పండుగ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపవాస దీక్షలు,ప్రార్థనలు, దాన ధర్మాల ద్వారా ఈ పవిత్ర మాసం సహనాన్ని, సేవాభావాన్ని, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు.రంజాన్ పండుగ శాంతి, సౌహార్దం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రతి ఒక్కరూ ఆనందంగా, సామరస్యంతో ఈ పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆయన సూచించారు.సమాజంలో ప్రేమ, పరస్పర గౌరవం మరింత బలపడాలని, అందరికీ ఆరోగ్యం, సంతోషం కలగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

## విద్యుత్ ఆర్టిజన్ బోనగిరి డివిజన్ చైర్మన్ గా:ఇంజ మహేష్

విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జేఏసీ భువనగిరి డివిజన్ చైర్మన్ గా, యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం, కాల్వపల్లి గ్రామానికి చెందిన, ఇంజ మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహేష్ మాట్లాడుతూ, విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను, సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, సొసైటీ కార్మికులను ఆర్టిజన్ గా గుర్తించాలని, పి సి రేటు కార్మికులు బిల్లు కలెక్టర్లు, స్పాట్ బిల్లర్లు, ఎస్ పి ఎం కార్మికులు, జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, టీజీ ఎస్పీడీసీఎల్ కంపెనీ కో చైర్మన్, బొక్క పందరి రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా కో చైర్మన్ భాస్కర్ నాయక్, హాజరయ్యారు. కన్వీనర్ గా బొట్ల రమేష్, కో చైర్మన్గా ఎడ్ల వెంకటేష్, వైస్ చైర్మన్ గా, సాహిని రమేష్ ఎన్నికయ్యారు. ఎన్నికకు సహకరించిన, రాష్ట్ర చైర్మన్, రాష్ట్ర కో చైర్మన్, రాష్ట్ర కో కన్వీనర్ కు, భువనగిరి డివిజన్ ఆర్టిజన్ కార్మికులందరికీ ఇంజ మహేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## న్యూస్ వార్ ప్రతినిధితో వినోద్ హిందుస్తానీ

### వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని నల్గొండ ఎస్పీకి ఆదేశం

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

జిల్లాలో సంచలనం సృష్టించిన హత్యాయత్నం ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ తీవ్రస్థాయిలో స్పందించింది. ఈ దారుణ ఘటనపై తక్షణమే విచారణ చేపట్టి, వారం రోజుల్లోగా సమగ్రమైన 'చర్యల నివేదిక' సమర్పించాలని నల్గొండ జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌ను కమిషన్ ఆదేశించింది.వివరాల్లోకి వెళ్తే.. న్యాయవాది వినోద్ హిందుస్థానీ అందించిన ఫిర్యాదు మేరకు కమిషన్ ఈ కేసును విచారణకు స్వీకరించింది.ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల ప్రాంతంలో చండూరు బీజేపీ కార్యకర్తలు దోటి కిరణ్ సహా మరో ఏడుగురిపై కొందరు దుండగులు పథకం ప్రకారం ప్రాణాంతక దాడికి పాల్పడ్డారని. ఈ దాడిలో పలువురు తీవ్రంగా గాయపడిన సంఘటన జరిగి 48 గంటలు గడిచినా పోలీసులు నిందితులను అరెస్టు చేయక పోవడంతో తాను కమిషన్ దృష్టికి తీసుకొని వెళ్ళటం జలరిగిందని తెలుపుతూ, నిందితులపై చిన్నపాటి సెక్షన్లు పెట్టి కేసును తప్పుదోవ పట్టించేలా పోలీసులు వ్యవహరిస్తున్నారని వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కమిషన్ ఆదేశాలు ఇవే.. (ఝుంవ చీశీ-210/36/7/2026): బాధితుల ఫిర్యాదుపై తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి ఈ కేసులో తీసుకున్న చర్యల నివేదికను ఆంగ్లంలోకి అనువదించి ఒక వారం లోపు కమిషన్‌కు





పంపాలి. సంబంధిత వివరాలను హెచ్‌ఆర్‌సీ నెట్ పోర్టల్ ద్వారా మాత్రమే సమర్పించాలని, ఈమెయిల్ నివేదికలను పరిగణించబోమని కమిషన్ స్పష్టం చేస్తూ నిందితులపై కఠిన చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కమిషన్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నదని తెలిపారు

# కాంగ్రెస్ పార్టీతోనే ముస్లిం మైనార్టీల అభివృద్ధి, తమ సంక్షేమం

### - కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధరావత్ వీరన్న నాయక్



కాంగ్రెస్ పార్టీతోనే ముస్లిం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ధరావత్ వీరన్న నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోనీ మజీద్ లో రంజాన్ పండుగ సందర్భంగా తన స్వంత ఖర్చులతో మహిళలాలకు తోఫాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని అన్నారు. ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, డిసిసి అధ్యక్షులు గుడిపాటి నర్సయ్యల సూచనలతో ముస్లిం సోదరులకు తోఫాను అందజేసినట్లు తెలిపారు. ముస్లిం సోదరులందరూ కాంగ్రెస్ పార్టీకి అన్నివేళ అండగా నిలవాలని కోరారు. అనంతరం మండలంలోని ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు జాఫర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నంద్యాల సోమిరెడ్డి, కొణతం అప్పిరెడ్డి, నాగు నాయక్, వెన్న మధుకర్ రెడ్డి, వేముల చిన్న, కందుల నర్సిరెడ్డి, గొప్పని అనిల్, గుడ్డు జానీ, మైనార్టీ నాయకులు పటాన్ రంజాన్, ఎండి చాంద్, ఎస్ కె సుభాని, జానీ పాషా, మునీర్, దావత్ పాషా, ఇసుఫ్, మైనార్టీ మహిళ తదితరులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

### ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును అందించిన నాయకులు

మత సామర్థ్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని సర్పంచ్ నాతాల వెంకటరామ్ రెడ్డి అన్నారు మండల పరిధిలోని గాజుల మల్కాపురం గ్రామంలోని మజీద్ వద్ద గురువారం రాత్రి రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు నాయకులతో కలిసి ఇఫ్తార్ విందు అందించి మాట్లాడారు మానవత్వానికి మతం లేదని,ఐకమత్యమే గ్రామ సౌభాగ్యానికి నిలయమని ఈ పవిత్ర రంజాన్ మాసంలో సోదరభావాన్ని చాటుతూ గ్రామ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు తమ ఉదారతతో ఈ విందుకు భారీ ఆర్థిక సహకారాన్ని అందించి అందరికీ ఆదర్శంగా నిలిచారని తనతోపాటు మాజీ సర్పంచ్ బండి ధనమ్మ రామకృష్ణారెడ్డి,ఉప్పుల రామ్ రెడ్డి తమ వంతు బాధ్యతగా ఒక్కొక్కరు రూ.10వేల చొప్పున విరాళం అందజేసి విందు నిర్వహణలో కీలక పాత్ర పోషించారని వారితో పాటు ఉప సర్పంచ్ సొంటి ఆంజనేయులు రూ.5వేలు, వార్డు సభ్యులు దేవి రెడ్డి సునంద రాంరెడ్డి, బండి వినీత చిన్న కృష్ణారెడ్డి కలిసి రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందించి ఈ విందు విజయవంతం కావడానికి పూర్తి సహకారాన్ని అందించారని తెలిపారు గ్రామ పెద్దలు చూపిన ఈ చొరవను ముస్లింలు కొనియాడారు కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి జరుపుకున్న ఈ ఇఫ్తార్ విందు గ్రామంలో పండుగ వాతావరణాన్ని నింపింది విందులో ప్రతి దాతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ ఇలాంటివి గ్రామాభివృద్ధికి, ఐక్యతకు దోహదపడతాయని హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు, గ్రామస్తులు పాల్గొన్నారు....

Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,